

బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

చంద్రబాబు అంటేనే మోసం

- కూటమి పాలనపై మండిపడిన ధర్మాన కృష్ణదాస్
- ఉర్లాంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై సమావేశం

నరసన్నపేట: ఎన్నికల సమయంలో బాబు ష్యూరిటీ, సూపర్ సిక్స్ పేరున ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు సీఎం చంద్రబాబు మోసం చేశారని, చంద్రబాబు అంటే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది మోసమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై ఉర్లాంలో నరసన్నపేట మండల కార్యకర్తల విస్తత స్థాయి సమావేశాన్ని ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహ మూర్తి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. 1994 నుంచి బాబు మోసం కొనసాగుతోందన్నారు. అప్పులు చేసి గొప్పలు చెప్పుకోవడమే మిగులుతుందని, ఇప్పటివరకు రూ. 1.72 లక్షలు అప్పులు చేశారని, ఒక్క సంక్షేమ పథకమూ సంక్రమంగా అమలు చేయలేద మండిపడ్డారు. కూటమి పాలన అంతా మోసాలమయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలన్నీ కొనసాగిస్తూ.. సూపర్ సిక్స్ అమలు చేస్తామని.. మరింత మెరుగైన పాలన అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. వీటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, రెడ్ బుక్ పాలన మాత్రం పక్కాగా అమలు చేస్తున్నారని విమర్శించారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ..పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడొద్దన్నారు. పార్టీని గ్రామాల్లో మరింతగా బలోపేతం చేయాలన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం గ్రామ స్థాయిలో కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు గుప్త, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు జి.వి.రమణి, పార్టీ మండల అధ్యక్షులు లుకలాపు రవి, పార్టీ నాయకులు బార్ల వేణు గోపాలరావు, దండి జయప్రకాశ్, బగ్గు రమణయ్య, నడిమింటి శాంతారావు, పతివాడ గిరీశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సతివాడ రామినాయుడు, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, యాబాజి రమేష్, పాగోటి గోవిందరావు, బుద్దల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



హిరమండలంలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు

మోసాలను ప్రజలకు వివరిద్దాం

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ సమావేశంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: కూటమి ప్రభుత్వ అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని మండల స్థాయిలో ధనుపురం గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లడుతూ.. సూపర్ సిక్స్, ఎన్నికల హామీల అమలు, పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బాబు ష్యూరిటీ అంటే.. మోసాలు, అవినీతి, అక్రమాలు, అబద్ధపు హామీలే అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన, ఎన్నికల హామీలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగడదామన్నారు. కూటమి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పేరుతో ఇంటింటికీ తిరగడం సిగ్గు చేటన్నారు. ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. సుపరిపాలన అంటే చెప్పిన హామీలన్నీ అమలు చేయాలని, ప్రజలను మోసం చేయడం కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించారన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో ఎన్ని పథకాలు అమలు చేశారో ప్రజలకు వివరించాలన్నారు. తమ ప్రభుత్వంలో అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, పింఛన్లు, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, నేతన్న నేస్తం, సున్నా వడ్డీ పథకం, ఉచిత పంటల బీమా వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ఇచ్చి ప్రజలను ఆదుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా ఇంత వరకు రైతు భరోసా, మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, మహిళకు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, తదితర పథకాల ఊసే లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి ఏవీ సురేష్, మాజీ జెడ్పీటీసీ లోలుగు లక్ష్మణరావు ఎంపీటీసీ సభ్యుడు గంగాధరరావు, ఎల్.ఎన్.పేట, పాతపట్నం మండల అధ్యక్షులు పి.విష్ణుమూర్తి, ఎస్.ప్రదీప్, పార్టీ నాయకులు మామిడి గంగాధరరావు, వెలమల బాలరాజు, లుకలాపు ప్రసాద్, సి.హెచ్.బాలకృష్ణ, బి.మురళి, సూర్యనారాయణ, రెడ్డి రామారావు పి.సింహాచలం, నక్క ఆనందరావు, పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

దగా చేయడమే బాబు నైజం

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

బూర్జ: ప్రజలను మోసం చేయడమే సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని కొల్లివలస గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేసిన సూపర్ సిక్స్ మోసాలపై గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. రాగోలు హైవే వద్ద బావాజీ మఠం భూములపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కన్ను పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను, అంగన్‌వాడీ కార్యకర్తలను తొలగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అర్హత ఉన్న వారికి కూడా పింఛన్ మంజూరు చేయడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల కోసం ఎవరైనా అడిగితే బెదిరిస్తూ కేసులు పెడుతున్నారు. గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలు వేస్తామన్నారు. ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో గ్రామస్థాయి నాయకులతో సమన్వయం చేసుకుని బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, మామిడివలస ఎంపీటీసీ గుమ్మడి రాంబాబు, పొందూరు మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఆమదాలవలస మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామల రావు, నాయకులు ఏగు రాజారావు, బొడ్డేపల్లి నాగరాజు, తొత్తడి సురేష్, సర్పంచ్‌లు బొడ్డేపల్లి వెంకటసత్యం, సూర ఆనందరావు, సూరపు ఉదయ్‌కుమార్, జీడి వేణు, బూరి శ్రీరామమూర్తి, నాయకులు ఎన్.రామకృష్ణ, సైరిగాపు శివ, జెడ్డు మహేష్, ఇసాయి వెంకటరావు, మామిడి శ్రీనివాసరావు, మామిడి కిరణ్, ఇప్పిలి తిరుపతిరావు, గేదెల కిరణ్, కోటేశ్వరరావు, ఎస్.శ్రీనువాసరావు, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

క్లుప్తంగా

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

సారవకోట: మండల కేంద్రంలో ఆర్టీసీ (అద్దె) బస్సు ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ప్రమాదం బుధవారం జరిగింది. మండల కేంద్రంలోని రైస్ మిల్లులో తవుడు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై గడ్డిపేట వెళ్తున్న చిన్నవాడును పాతపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ (అద్దె) బస్సు ఢీకొంది. క్షతగాత్రుడిని సారవకోట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. ఇక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అలసత్వం వహిస్తే చర్యలు

సారవకోట: వృద్ధులు, దివ్యాంగలకు సకాలంలో రేషన్ అందించాలని సీఎస్ డీటీ షరీఫ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో బుధవారం మాట్లాడారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీలోగా వచ్చే నెల రేషన్ ఇంటింటికీ వెళ్లి అందించాలన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో అలసత్వం వహించే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

125 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 125 మందికి కొత్తూరు ఆప్తాలమిక్ జానకిరామయ్య కంటి పరీక్షలు చేశారు. 43 మందిని కంటి ఆపరేషన్లకు గుర్తించారు. వీరిని విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. రోగులకు ఉచిత భోజనం, ప్రయాణం కల్పించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీఆర్వో హరిబాబు, బోగి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మెయిన్ రోడ్డులోని కుళాయి వద్ద వేచి ఉన్న మహిళలు

హిరమండలం: మేజర్ పంచాయతీలోని సుభలయ కాలనీలో గత నాలుగైదు రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదు. మెయిన్ రోడ్డులోని ఉమారుద్ర కోటేశ్వర ఆలయం సమీపంలో ఉన్న కుళాయి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ మహిళలు కోరుతున్నారు.

గ్రామ కంఠం ఆక్రమణ

పాతపట్నం: మండలంలోని కాగువాడ గ్రామంలో జాతీయ రహదారి అనుకుని, పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న గ్రామ కంఠం (సర్వే నంబర్ 285) సుమారు 15 సెంట్లలో కొంతమంది ఆక్రమణదారులు షెడ్ల (దుకాణాలు) నిర్మాణం చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎన్.ప్రసాదరావుకు, ఎంపీడీఓ పి.చంద్రకుమారికి గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామ కంఠానికి అనుకుని మల్లికార్జునస్వామి దేవాలయం ఉందని, ఆక్రమణలను తక్షణమే నిలుపుదల చేయాలని కోరారు.



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్రరావు

అక్రమ నిర్మాణాలను డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్రరావు పరిశీలించారు. తక్షణమే పనులు నిలుపుదల చేయాలని ఆదేశించారు.

పరామర్శ..



హిరమండలం: చిన్నారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి



బూర్జ: సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

హిరమండలం: మండలంలోని చొర్లంగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వంగపల్లి చిన్నారావు తల్లి చిలకమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించారు. తంపలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డోల దొరబాబు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ వి.సావిత్రి, హిరమండలం, ఎల్.ఎన్.పేట, పాతపట్నం మండలాల అధ్యక్షులు మీసాల వెంకటరామకృష్ణ, పి.విష్ణుమూర్తి, ఎస్.ప్రదీప్, నాయకులు రెడ్డి రామారావు, సూర్యనారాయణ, వి.బాలరాజు, బాలకృష్ణ, ఆనందరావు ఉన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: మండలంలోని మెట్టూరు ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మెజ్జాడ చక్రపాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. చక్రపాణి భార్య ఏకాశమ్మ, కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, బొమ్మాలి నగేష్, టి.తులసి, తదితరులు ఉన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని డొంకలపర్త గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చందక సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. అయ్యవారిపేటలో చోడవరపు నర్సమ్మ మృతి చెందడంతో ఆమె అల్లుడు, మాజీ సర్పంచ్ మామిడి శ్రీరాములును పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మామిడి శ్రీనివాసరావు, ఇప్పిలి తిరుపతిరావు, జల్లు బలరాంనాయుడు, టంకాల కూర్మినాయుడు, తదితరులు ఉన్నారు.

కార్డన్ సెర్చ్..

ఆమదాలవలస:

అపరచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆమదాలవలస ఎస్ఐ-2 సీపాన కాంతారావు సూచించారు. పట్టణంలోని ఐ.జె.నాయుడు కాలనీలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రెండు ద్విచక్ర వాహనాలకు ఎటువంటి ధ్రుపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, మాదకద్రవ్యాలు, జూద స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బైక్‌ల వివరాలను అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

హెచ్చరిక బోర్డు ఉన్నా ఆగని నిర్మాణాలు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్అర్‌కాలనీ వద్ద గల వంశధార వరద కాలువపై అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ బోర్డును తొలగించి బుధవారం కొంతమంది ఆక్రమణదారులు పనులు చేపట్టారు. పనులు నిలుపుదల చేయాలని వీఆర్వో వారికి సూచించారు. ఆ సమయంలో వీఆర్వోపై అక్రమణదారులు దుర్భాషలాడారు. ఈ విషయాన్ని తహసీల్దార్ బాలకృష్ణ దృష్టికి వీఆర్వో తీసుకెళ్లారు. వీఆర్వోపై దుర్భాషలాడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



నిర్మాణాలు నిలుపుదల చేయాలని సూచిస్తున్న పోలీసులు

తరలిరావాలి

సరుబుజ్జిలి: ఈ నెల 18వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించనున్న శాంతియుత నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఏపీ ఫోరం-2003 కన్వీనర్ కొత్తకోట శ్రీహరి కోరారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57ను రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెమో 57ను రాష్ట్రంలో అమలు చేయడంలో నెలకొన్న తాత్సారంపై జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గల జ్యోతిరావు పూలే పార్కు సమీపంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

విచారణ..



ఇంటింటికీ వెళ్లి విచారణ చేపడుతున్న డీఎస్ఓ, రెవెన్యూ సిబ్బంది

హిరమండలం: మండల కేంద్రంలోని ఎస్.వి.ఎస్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది గ్యాస్ సిలిండర్‌పై అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై జిల్లా సరఫరా అధికారి (డీఎస్ఓ) బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్ఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఐవీఆర్ సర్వేలో హిరమండలంలో 60 శాతం మంది వినియోగదారుల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆర్ఐ ఉమాశంకర్, వీఆర్ఓ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

బూర్జ: మండలంలోని ఓని గెడ్డ కాలువకు సాగునీటిని ఏఈ కె.దాలయ్య బుధవారం విడుదల చేశారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

ఆమదాలవలస: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయ్ కుమారి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతలు సహకారించాలి

జలుమూరు: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని చల్లవానిపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.నిర్మలాదేవి అన్నారు. గురువారం చల్లవానిపేట గ్రామానికి చెందిన పాగోటి భాస్కరరావు పాఠశాల అభివృద్ధికి రూ.పది వేలు అందించారు.

ఎరువుల కోసం క్యూ కట్టారు..



ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం పెద్ద సినీ స్టార్ రిలీజ్ సినిమా టికెట్ల కోసం జనాలు క్యూలో ఉన్నారనుకొంటే మనం పొరపడినట్లే. సరుబుజ్జిలి మండలం విజయరాంపురం గ్రామ సచివాలయం వద్ద ఎరువుల కోసం రైతులు బుధవారం గంటల తరబడి ఎండలోనే నిలబడి నానా అవస్థలు పడ్డారు. - సరుబుజ్జిలి

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పోలాకి: ఈ నెల 17వ తేదీన మండలంలోని సుసరాంలోని బీజే నాయుడు ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మరకే మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు బుధవారం తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ ముద్దాడ దమయంతి, పార్టీ విభాగాల బాధ్యులు, ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. 'బాబుష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' రీకాల్ మేనిఫెస్టోపై చర్చ ఉంటుందన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: ఈ నెల 17వ తేదీన కొత్తూరులోని శ్రీరస్తు - శుభమస్తు కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు బుధవారం తెలిపారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతారన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యేతిరేక విధానాలపై చర్చిస్తామన్నారు. పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని పడాల పాపారావు కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి మండల వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బాబుష్యూరిటీ..మోసం గ్యారంటీ, రీకాల్ మేనిఫెస్టోపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. నూతనంగా నియమించిన పార్టీ కమిటీ సభ్యులను సత్కరిస్తామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంఎల్ఎస్ గొడౌన్ తనిఖీ

జలుమూరు: సక్రమంగా తూనిక చేసిన తరువాతే నిత్యావసర సరుకులు అందించాలని శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష్ అన్నారు. జలుమూరు మండల కేంద్రంలో ఉన్న ఎంఎల్ఎస్ గొడౌన్‌ను బుధవారం తనిఖీ చేశారు. బియ్యం, పంచదార, తదితర నిత్యావసర సరుకులు వే బ్రిడ్జ్‌లో తూకం చేసిన అనంతరం డీలర్లకు చేర్చాలన్నారు. రికార్డులు పరిశీలించి ప్రస్తుత నిల్వలను సరి చూశారు. గొడౌన్ ఇన్‌చార్జి కె.కోటేశ్వరరావు, ఆర్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయి ప్రత్యూష